

TGTEL/26/A2094

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 283 | హైదరాబాద్ | శనివారం | 21-03-2026 | పేజీలు: 08


ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించింది. చంటిబిడ్డ మొదలు వృద్ధుల వరకు అన్ని సెక్షన్ల ప్రజలకు భీమా కల్పించేలా సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మొత్తం రూ. 3.24 లక్షల కోట్ల బడ్జెట్లో దాదాపు రూ. 1.04 లక్షల కోట్లను సంక్షేమానికే వెచ్చిస్తున్నది. మొత్తం ఖర్చులో ఇది మూడవ వంతు. ఆరు గ్యారంటీల అమలుకే రూ. 50 వేల కోట్లకు పైగా కేటాయించింది. చిన్నారులు, విద్యార్థులు, యువత, చేనేత, మహిళలు, వృద్ధులు, ఆదివాసీ-గిరిజనులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. ఇలా అన్ని సెక్షన్ల ప్రజలనూ గమనంలోకితీసుకున్నది. సంక్షేమానికి చిరునామాగా బడ్జెట్‌నురూపొందించింది. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి భరోసానిచ్చేలా ఉచితంగా జీవిత బీమాను కల్పించింది. ప్రీ-ప్రైమరీ స్కూల్ మొదలు జూనియర్ కాలేజీ వరకు ఉచిత బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రవేశపెడుతున్నది ఇందుకోసం బడ్జెట్లోనూ నిధులను కేటాయించింది

# ప్రతీ కుటుంబానికి భరోసా



## రూ.3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చాం

రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు

మూలధన వ్యయం రూ.47,267 కోట్లు

విద్యాశాఖకు రూ.26,674 కోట్లు

వైద్య శాఖకు రూ.13,679 కోట్లు

విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు

పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యం

ఆరు గ్యారెంటీల అమలకు అత్యధిక ప్రాధాన్యం: భట్టి

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టింది. ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మొత్తం రూ.3,24,234 కోట్లతో రూపొందించిన ఈ బడ్జెట్‌ను సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూపొందించామని ఆయన తెలిపారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అనుసరించుతూ పాలన కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఇదే సమయంలో శాసన మండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

**బడ్జెట్ స్వరూపం**

ఈ ఏడాది బడ్జెట్ మొత్తం పరిమాణం రూ.3,24,234 కోట్లుగా నిర్ణయించగా, అందులో రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా ప్రతిపాదించారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యత ఇచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. కొత్త రుణాల రూపంలో రూ.73,383 కోట్లను సమీకరించేందుకు ప్రతిపాదనలు చేశారు.

**సంక్షేమం–అభివృద్ధికి సమన్వయం**

ఈ బడ్జెట్‌లో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆర్థిక మంత్రి వివరించారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి, ..మిగతా 2లో

# బోగస్ బడ్జెట్



అన్ని వర్గాల ప్రజలకు నిరాశ

మైనార్టీలకు మొండి చేయి

గత బడ్జెట్‌నే మళ్లీ చదివారు

డేట్లు, డెడ్ లైన్లు మారాయి అంతే..

మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్రంగా నిరాశ పరిచిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఇది బోగస్ బడ్జెట్, బడా జూటా బడ్జెట్, ఇదొక వట్టి బడ్జెట్ అంటూ దుయ్యబట్టారు. ఈ బడ్జెట్ అభయహస్తం కాదు రిక్త హస్తం అని అర్థమైందన్నారు. ఆరు గ్యారెంటీలకు విజయవంతంగా ఘోరీ కట్టారని మండిపడ్డారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా హాల్‌లో హరీశ్ రావు శుక్రవారం మాట్లాడారు. బడ్జెట్‌లో 20 పేజీలు పెంచారని, రూ.20 వేల కోట్లు కూడా పెంచారని, కానీ ఆరు గ్యారెంటీల ప్రస్తావన గానీ, నిధుల కేటాయింపు గానీ చేయలేకపోయారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాగితాల మీద అంకెలు ఉన్నాయి తప్ప, ప్రజల కష్టాలు తీర్చడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డిక్లరేషన్లు ఓట్ల కోసమే ..మిగతా 2లో

# ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్..

ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు

ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదు

నిరుద్యోగంలో రైజింగ్ అవుతున్నాం

56 శాతం ఉన్న బీసీలకు ఇచ్చింది 4 శాతమే

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



2

# ఇదొక ఫాల్స్, ఫెయిల్డ్, ఫ్యాన్సీ బడ్జెట్

పొరపాటున గతేడాది బడ్జెట్ చదివారా?

అప్పటికీ.. ఇప్పటికీ పెద్ద తేడా లేదు

విద్యకు 8 శాతం

నిధులు కేటాయించడం బాధాకరం

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు




2

# బోగస్ బడ్జెట్

మొదటిపేజీ తరువాయి



తప్ప ఆ వర్గాల అభివృద్ధి కోసం కాదన్నది బడ్జెట్ నిరూపించిందని, గత బడ్జెట్‌లో చెప్పిన పథకాలు అమలు చేయలేదని వివరించారు. ఈసారి అవే పెట్టారని, పోయిన బడ్జెట్‌లో రాజీవ్ యువ వికాసం కోసం రూ.6 వేల కోట్లు అన్నారు, ఈసారి కూడా అదే చెప్పారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలోనే అదే జరిగిందని చెప్పారు. ఒక్క రూపాయి ఇవ్వలేదని, బడ్జెట్‌లో వాస్తవికత లేదని, అంకెల గారడీ తప్ప కేటాయింపుల విషయంలో, ఖర్చు విషయంలో చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేరు చెప్పి వారి ఆత్మ క్షోభించేలా చేస్తున్నారని అన్నారు. తెలంగాణను, హైదరాబాద్‌ను క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు ముక్కలు చేయడం తప్ప విషయం లేదన్నారు. అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని హరీశ్ రావు మండిపడ్డారు. మూడేళ్లు నిండకముందే మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేశారని, సకల జనులకు దక్కింది మాత్రం గుండుసున్నా అని విమర్శించారు. 'బీఆర్ఎస్ అప్పు చేసి ప్రాజెక్టులు, చెక్ డ్యాంలు, ఆస్తుల కల్పన చేసింది. బడ్జెట్ అంకెల గారడీ, మాటల గారడీ తప్ప పేదల పట్ల చిత్తశుద్ధి లేదు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చొబెట్టుకొని అంబేద్కర్ సూక్తులు మాట్లాడడం దారుణం. కాంగ్రెస్ ప్రభుత్వంలో స్కాంలు తప్ప స్కీంలు ఉన్నాయా? గురుకులాల్లో తిండి పెట్టే దిక్కు లేదు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఆర్భాటాలు చేస్తున్నారు. ఉద్యోగాలు, పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలి. విదేశాలకు వెళ్లింది పెట్టుబడుల కోసం కాదు అక్రమ సంపాదన భద్రపరుచుకోవడానికి మాత్రమే. మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టినందుకు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి. ఆరు గ్యారెంటీల విషయంలో గతేడాది రూ.56 వేల కోట్లు పెడితే, ఈ బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లకు కుదించారు. క్యూర్, ప్యూర్, రేర్ కాదు చోర్ మోడల్, గోల్ మాల్ మోడల్'' అని మండిపడ్డారు. భూముల మీద ఉన్న ప్రేమ, ప్రజల మీద ప్రభుత్వానికి లేదన్నారు. పాలసీల పేరిట అక్రమాలు చేస్తే అభివృద్ధి జరుగుతుందా అంటూ హరీశ్ రావు ప్రశ్నించారు. ఇండస్ట్రియల్ హబ్ కాదు, కరప్షన్ హబ్‌గా మార్చారని ఆరోపించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ కడతాం అంటారు, అసలు అంత భూమి ఉన్నదా అని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు నియామకపత్రాలు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం అంటున్నారని మండిపడ్డారు. మహాలక్ష్మి పేరిట రూ.2,800 కోట్ల బకాయి పడ్డారని, ఆర్టీసికి రూ.9,222 కోట్లు ఇచ్చి ఉంటే రూ.3 వేల కోట్ల అప్పులు ఎందుకు అయ్యాయని నిలదీశారు. ఆర్టీసీ లాభాల్లో ఉంటే పింఛన్ బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఎందుకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదో చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేశారు.

# ప్రతీ కుటుంబానికి భరోసా

మొదటిపేజీ తరువాయి

రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు వంటి అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని పథకాలను రూపొందించినట్లు తెలిపారు.

**ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం**

రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు భద్రత కల్పించే ఉద్దేశంతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రవేశపెట్టారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించనున్నారు. ఈ పథకానికి రూ.4 వేల కోట్ల నిధులు కేటాయించారు. జూన్ 2 నుంచి ఈ పథకం అమలులోకి రానుంది.

**విద్యా రంగానికి ప్రాధాన్యత**

విద్యా రంగానికి ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే పథకాన్ని ప్రకటించారు. అంతేకాకుండా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ప్రవేశపెట్టారు. విద్యాశాఖకు రూ.26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా స్కూళ్ల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయించారు.

అదేవిధంగా ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2,000 ఉపకార వేతనం అందించనున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల ఉపకార వేతనాల కోసం రూ.4,343 కోట్లు కేటాయించారు.

**ఆరోగ్య రంగం–డిజిటల్ సేవలు**

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు అందించే విధంగా కొత్త ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేయనున్నారు. వైద్య శాఖకు రూ.13,679 కోట్లు కేటాయించగా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి రూ.1,143 కోట్లు కేటాయించారు.

**వ్యవసాయం–రైతు సంక్షేమం**

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు కేటాయించారు. రైతు భరోసా పథకానికి రూ.18 వేల కోట్లు కేటాయించారు. వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ చెల్లింపుల కోసం రూ.3,500 కోట్లు ప్రతిపాదించారు. పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు కేటాయించారు.

**విద్యుత్–పౌరసరఫరాలు**

విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు కేటాయించగా, పౌర సరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు కేటాయించారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా, నిత్యావసర సరుకుల అందుబాటుకు ఈ నిధులు ఉపయోగపడతాయని ప్రభుత్వం తెలిపింది.

**సామాజిక న్యాయం–వర్గాల సంక్షేమం**

సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు కేటాయించారు.

* ఎస్సీ సంక్షేమం - రూ.11,784 కోట్లు
* ఎస్టీ సంక్షేమం - రూ.7,934 కోట్లు
* బీసీ సంక్షేమం - రూ.12,511 కోట్లు
* మైనార్టీ సంక్షేమం - రూ.3,769 కోట్లు

మహిళా సంక్షేమం కోసం మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు కేటాయించారు. కళ్యాణ లక్ష్మీ పథకానికి రూ.3,683 కోట్లు కేటాయించారు.



**గృహ, జీవనోపాధి పథకాలు**

పేదలకు గృహ సౌకర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లు పథకానికి రూ.5,500 కోట్లు కేటాయించారు. చేయూత పథకానికి రూ.14,861 కోట్లు కేటాయించారు. మహాలక్ష్మీ పథకానికి రూ.4,305 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు కేటాయించారు. మహాలక్ష్మీ గ్యాస్ సబ్సిడీ పథకానికి రూ.723 కోట్లు కేటాయించారు.

**మౌలిక వసతుల అభివృద్ధి**

పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణకు కూడా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

* మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ - రూ.1,500 కోట్లు
* మెట్రో రైలు ఫేజ్ 2 - రూ.600 కోట్లు
* ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి - రూ.1,000 కోట్లు
* పర్యాటక రంగానికి - రూ.1,224 కోట్లు

కార్మిక శాఖకు రూ.998 కోట్లు కేటాయించారు. నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది.

**ఆరు గ్యారంటీల అమలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేకంగా రూ.50,713 కోట్లు కేటాయించారు. ఈ పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష లబ్ధి చేకూర్చడమే లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తంగా ఈ బడ్జెట్‌ను సమగ్రాభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన సూత్రాల ఆధారంగా రూపొందించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలపరిచే దిశగా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే దిశగా ఈ బడ్జెట్ పనిచేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఇదొక ఫాల్స్, ఫెయిల్డ్, ఫ్యాన్సీ బడ్జెట్

- **పొరపాటున గతేడాది బడ్జెట్ చదివారా?**
- **అప్పటికీ.. ఇప్పటికీ పెద్ద తేడా లేదు**
- **విద్యకు 8 శాతం నిధులు కేటాయించడం బాధాకరం**
- **ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పొరపాటున గతేడాది బడ్జెట్ చదివినట్లున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఎద్దేవా చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత బడ్జెట్‌కు ప్రస్తుత బడ్జెట్‌కు పెద్ద తేడా ఏమీ లేదన్నారు. విద్యా శాఖకు కేవలం 8 శాతం నిధులు కేటాయించడం బాధాకరమని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ అని వ్యాఖ్యానించారు. విద్యా రంగానికి గతేడాది కంటే రూ.1,000 కోట్లు పెంచినట్లు చూపిస్తున్నా, ఓవరాల్ బడ్జెట్‌లో దీని వాటా కేవలం 8 శాతం మాత్రమేనని రాంచందర్ రావు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ (13%), బిహార్ (21%) తమ బడ్జెట్‌లలో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతలో సగం కూడా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు అని గొప్పలు చెప్పడం తప్ప, విద్యా వ్యవస్థను మెరుగుపరిచే ఒక్క ప్రయత్నం కూడా కనిపించడం లేదని ఆరోపించారు. ఆరోగ్యం విషయంలో పెద్దగా ప్రయారిటీ ఇవ్వలేదని చురకలంటించారు. ఆరోగ్యశ్రీకే గతి లేదని, అలాంటిది పెన్షన్లకు ముడి పెడుతున్నారంటూ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తన ఘనతగా చెప్పుకుంటున్న ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ అన్నీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు, మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా పథకాల వల్ల వచ్చినవేనని రాంచందర్ రావు స్పష్టం చేశారు. రీజనల్ రింగ్ రోడ్, దాని పక్కన వచ్చే రీజనల్ రింగ్ రైల్ కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఫండింగ్ అని, కేవలం భూసేకరణ తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదుసార్లు రైతు భరోసా ఇవ్వాలని, కానీ ఇప్పుడు వేసేది మూడోసారి మాత్రమేనని పేర్కొన్నారు. బడ్జెట్‌తో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చెవిలో పువ్వు పెట్టిందని ఎద్దేవా చేశారు. మైనారిటీల సంక్షేమానికి బడ్జెట్ పెంచిన రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల్లో పని చేసే అర్చకుల వేతనాలు, ధూపదీప నైవేద్యానికి సంబంధించి ఎక్కడా మాట్లాడలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక హిందూ ఆలయాలపై దాడులు జరిగాయని గుర్తు చేశారు. బడ్జెట్‌లో హైదరాబాద్‌కు సున్నా ఇచ్చారని చురకలంటించారు. జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారని, మరి దానిపై బాధ్యత ఏదని ప్రశ్నించారు. నిధులు కేటాయించకుంటే జీహెచ్ఎంసీ ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. బడ్జెట్ ప్రజల ఆశలను నిరాశ కలిగించిందని, ఇదొక ఫాల్స్, ఫెయిల్డ్, ఫ్యాన్సీ బడ్జెట్ అంటూ రాంచందర్ రావు విమర్శలు చేశారు.



# ఇది రీ విజన్ బడ్జెట్

- **ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు**
- **ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదు**
- **నిరుద్యోగంలో రైజింగ్ అవుతున్నాం**
- **56 శాతం ఉన్న బీసీలకు ఇచ్చింది 4 శాతమే**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):



ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు మోపారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ అని దుయ్యబట్టారు. రూ.లక్షల కోట్ల అప్పులు తెచ్చినా ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేదన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ మాత్రం ప్రజామోదం పొందేలా లేదని చెప్పారు. రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉంటే వారికి 4 శాతం నిధులు మాత్రమే కేటాయించారని, ఏటా రూ.20 వేల కోట్లు అంటూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇక్కడకు వచ్చి మాట్లాడారని గుర్తు చేశారు. ఎంబీసీ మినిస్ట్రీ, ఎంబీసీలో వెనుబడిన కులాలకు కార్పొరేషన్లు అన్నారు, ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కవిత అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పుస్తెలు, మట్టెలు చేసే జీవోపై మొదటి సంతకం పెడతామని వెల్లడించారు. ఈ రాష్ట్రంలో గిరిజన మంత్రి లేని మొదటి ప్రభుత్వం ఇదేనని, కచ్చితంగా లంబాడా మినిస్టర్‌ను కూడా నియమించాలని డిమాండ్ చేశారు. 22 లక్షల 50 వేల ఇళ్లు నిర్మిస్తామని చెప్పి వాటికి రూ.5,500 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. గతే బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయిస్తే ఈ సారి రూ.7 వేల కోట్లు తగ్గించారన్నారు. అంటే పేదల మీద ప్రేమ ఉన్నట్లు రాహుల్ గాంధీ మాట్లాడేదంతా ఫేక్ అని విమర్శించారు. మైనార్టీ, రైతు భరోసా, కూలీలకు ఇచ్చే సాయం, గృహజ్యోతి ఇలా గతేడాది బడ్జెట్ పెట్టారని, అందుకే ఇది విజన్ బడ్జెట్ కాదన్నారు. రీ విజన్ బడ్జెట్ అంటూ సెటైర్లు వేశారు. రూ.20 వేల కోట్లు అప్పులు రీస్ట్రక్చర్ చేసుకునేలా చేశామని గొప్పలు చెబుతున్నారని, కేంద్రం ఇచ్చే గ్రాంట్ దాదాపు రూ.20 వేల కోట్లు అని గత బడ్జెట్‌లో చెప్పారని, వచ్చింది మాత్రం రూ.11 వేల 120 కోట్లు మాత్రమే అని అన్నారు. ఈ ఏడాది కూడా కేంద్రం గ్రాంట్లు రూ.24 వేల కోట్లు అంటూ ఎస్టిమేట్ చేశారని, అంటే ఇది ప్రజలను మోసం చేయడమే అని మండిపడ్డారు. రెవెన్యూ సర్ ప్లస్ రూ.6 వేల 8 వందల కోట్లు అంటూ ఎస్టిమేట్ చేశారని, గతేడాది కూడా రూ.2 వేల కోట్లు ఎస్టిమేట్ చేస్తే, రూ.5 వందల కోట్లు మాత్రమే వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు బడ్జెట్ పైసా కేటాయించలేదని, కొత్త పింఛన్లు లేవు, కొత్త ఉద్యోగాల భర్తీ ఊసే లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల 62 వేల కోట్లు ఎఫ్ఆర్ఎంబీ పరిధిలో, రూ.3 లక్షల కోట్లకు పైగా కార్పొరేషన్ల పేరుతో అప్పు తెచ్చిందని, మొత్తం రాష్ట్రం అప్పు రూ.8 లక్షల 64 వేల 198 కోట్లకు చేరిందన్నారు. అంటే ఒక్కో వ్యక్తిపై రూ.2 లక్షల 16 వేలు అప్పు ఉన్నదని తెలిపారు. ఒక్కో కుటుంబంపై దాదాపు రూ.9 లక్షల అప్పు ఉన్నట్లే అని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పు తెచ్చిన డబ్బులు ఏమైనా సంక్షేమ పథకాలు అమలు చేశారా అంటే అది లేదన్నారు.

# తెలంగాణలో పది పరీక్షలు ఉండవు

- **12 వ తరగతి వరకు కొనసాగిస్తాం**
- **విద్యావిధానంలో సమగ్రమైన మార్పులు**
- **విద్యాశాఖ కమిషన్ నివేదికను ప్రత్యేక కమిటీకి పంపించాం**
- **ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కొనసాగుతోంది**
- **హరీశ్ రావుకు పూర్తి స్థాయిలో ఉపశమనం దక్కలేదు**
- **కేవలం చక్రధర్ గౌడ్ కేసులోనే రిలీఫ్**
- **చట్టం ముందు అందరూ సమానమే**
- **చిట్ చాట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో కీలక మార్పులకు సంకేతాలిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదోతరగతి పరీక్షల విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై పదోతరగతి పరీక్షలు నిర్వహించే విధానాన్ని పునఃపరిశీలించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే అమల్లో ఉన్న ఇంటర్మీడియట్ వరకు సమగ్ర విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులపై అనవసరమైన పరీక్షల భారం తగ్గించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

అసెంబ్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తమ ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధి అనే ద్వంద లక్ష్యాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టడం ద్వారా విద్యార్థులకు ఒత్తిడి తగ్గించి, వారికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన నివేదికను ఇప్పటికే ప్రత్యేక కమిటీకి పంపినట్లు తెలిపారు. ఆ కమిటీ సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు.

ఇదే సమయంలో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కారు రేస్ వ్యవహారం, ఫోన్ ట్యాపింగ్ కేసులపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. ఈ కేసుల్లో చట్టపరమైన విధానాలను పూర్తిగా పాటిస్తూ ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే కోర్టుల్లో సాంకేతిక కారణాలతో కేసులు కొట్టివేయబడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అందుకే అన్ని ఆధారాలు సమగ్రంగా సేకరించిన తర్వాతే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు కోర్టులో పూర్తిస్థాయి ఉపశమనం లభించలేదని పేర్కొన్నారు. అదే సమయంలో చక్రధర్ గౌడ్ దాఖలు చేసిన వేధింపుల కేసులో మాత్రం కొంత ఊరట లభించిందని వివరించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఎవరిపైనా అన్యాయం జరగకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా ముఖ్యమంత్రి విశదీకరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు మొత్తం 3.47 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసినట్లు తెలిపారు. అయితే ఈ అప్పులు కొత్తగా అభివృద్ధి పనుల కోసం మాత్రమే కాకుండా, గత ప్రభుత్వ కాలంలో తీసుకున్న అప్పులను తీర్చడానికే ఎక్కువగా వినియోగించాల్సి వచ్చిందని చెప్పారు. గత 26 నెలల్లో సుమారు 3.3 లక్షల కోట్ల రూపాయల మేర పూర్వపు అప్పులను తాము చెల్లించినట్లు వెల్లడించారు.

ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తీవ్ర విమర్శలు చేశారు. ఒక్క ఎకరాకు కూడా నీరు అందించని పరిస్థితిలోనే ఆ ప్రాజెక్టుకు సంబంధించిన భారీ అప్పులను తాము తీర్చాల్సి వచ్చిందని అన్నారు. సుమారు 44 వేల కోట్ల రూపాయల అప్పును ఈ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం భరించాల్సి వచ్చిందని వివరించారు. గత పాలనలో జరిగిన ఆర్థిక లోపాలను తాము పునరావృతం చేయబోమని స్పష్టం చేశారు.

భూబదలాయింపుల అంశంపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. హిల్టు సంబంధిత భూముల వ్యవహారంపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. మొత్తం పరిశ్రమలకు చెందిన భూములన్నీ అమ్మినా లక్ష కోట్లు కూడా రావని చెప్పారు. అలాంటి పరిస్థితిలో ఐదు లక్షల కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. మాజీ మంత్రులు కోరితే ఏదైనా విచారణకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.



ఇక రాజకీయ పరంగా కూడా కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరమని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే విషయం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న జిల్లాలు, మండలాల వ్యవస్థలో ఎలాంటి మార్పులు ఉండవని కూడా ప్రకటించారు.

మరోవైపు శాసన మండలి నియామకాలపై కూడా ముఖ్యమంత్రి క్లారిటీ ఇచ్చారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు సంబంధిత నియామకాల విషయంలో గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ప్రభుత్వం చట్టబద్ధంగా, పారదర్శకంగా అన్ని నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

మొత్తం మీద రాష్ట్రంలో విద్య, ఆర్థిక వ్యవస్థ, పరిపాలన, చట్ట వ్యవస్థ వంటి పలు రంగాల్లో కీలక మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతున్న సంకేతాలు ఈ ప్రకటనల ద్వారా వెల్లడయ్యాయి. ముఖ్యంగా పదోతరగతి పరీక్షల రద్దు అంశం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ వర్గాల్లో విస్తృత చర్చకు దారి తీసే అవకాశం ఉంది. ప్రభుత్వ తుది నిర్ణయం ఎలా ఉండబోతుందో అన్నది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

## సత్యనారాయణ కాలనీలో చలివేంద్రం ప్రారంభం

**నాగారం,మార్చి 19(ప్రజాక్షేత్రం):**

ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ లోని సత్యనారాయణ కాలనీ లోని శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ హరిబాబు,చిన్నం రాజు సాయినాథ్ గౌడ్,గుడి అధ్యక్షులు హరిగోపాల్,గరికపాటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు రఘు ప్రసాద్, టీజేఎస్ పార్టీ నాగారం అధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ రెడ్డి,కందాడి శ్రీనివాస్ రెడ్డి,ముక్కెర కరుణాకర్ రెడ్డి,చంద్రశేఖర్,సాయిలు,ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ యూత్ అధ్యక్షుడు భద్రు నాయక్, దేవస్థానం కమిటీ జనరల్ సెక్రటరీ నిరంజన్ బాబు,పవన్ కుమార్, ఉమా శంకర్,జనార్దన్ రెడ్డి, రెడ్యానాయక్,తిరుపతి రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు,కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## కీసరలో అక్రమ ఆవుల తరలింపు బట్టబయలు

**కీసర,మార్చి 20(ప్రజాక్షేత్రం):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కీసర ప్రాంతంలో అక్రమంగా ఆవులను తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పట్టుకుని బట్టబయలు చేశారు.కీసరలోని రాఘవేంద్ర హోటల్ ఎదుట ఈ ఘటన జరిగింది. గురువారం సాయంత్రం సమయంలో అనుమానాస్పదంగా వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనాన్ని గమనించిన కార్యకర్తలు వెంటనే అడ్డగించారు. వాహనాన్ని తనిఖీ చేయగా, లోపల అనారోగ్యకర పరిస్థితుల్లో గూడ్చి ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించారు.ఆవులను సరైన రక్షణ లేకుండా,గుమిగూడ్చి తరలించడం గమనార్హం. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ఆవులను ఎక్కడి నుండి ఎక్కడికి తరలిస్తున్నారు,దాని వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటి అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై కూడా విచారణ కొనసాగుతోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం,ఇటీవలి కాలంలో ఇలాంటి అక్రమ తరలింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## సోంపల్లి గ్రామ యువత సేవా స్ఫూర్తి

- **ముసలమ్మ–ముసలయ్య దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమం ఘన విజయం**

**బూర్గంపాడు మార్చి 20 (ప్రజాక్షేత్రం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,బూర్గంపాడు మండలం,సోంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సోంపల్లి గ్రామ యువత ఆధ్వర్యంలో ముసలమ్మ-ముసలయ్య దేవస్థానం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది.ఈ సేవా కార్యక్రమం ద్వారా గ్రామ యువత తమ సామాజిక బాధ్యతను చాటుతూ,భక్తులకు భోజన సదుపాయం కల్పించారు.కార్యక్రమం ఉదయం పూజలతో ప్రారంభమై,అనంతరం దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో చిన్నా పెద్దా తేడా లేకుండా అందరికీ సమానంగా అన్నదానం నిర్వహించడం విశేషం. భక్తులు కూడా ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, యువత ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. యువతలో సేవా భావం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమం నిర్వహణలో గ్రామ యువకులు క్రమశిక్షణతో పనిచేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అన్నదానం సజావుగా కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేపట్టడం వల్ల కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు ,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వంతు సహకారం అందించారు.కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సోంపల్లి గ్రామ యువత హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు యువత పేర్కొన్నారు.



## వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో తిరందాసు గోపి వర్ధంతి

- **వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో తిరందాసు గోపి వర్ధంతి**
- **సి ఐ టి యు**

**వలిగొండ మార్చి 20(ప్రజాక్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లాలో సిఐటియు మొట్టమొదటి జిల్లా ప్రధాన కార్యదర్శి తిరందాసు గోపి తొమ్మిదవ వర్ధంతిని సిఐటియు వలిగొండ మండలం కమిటీ ఆధ్వర్యంలో వలిగొండ మార్కెట్ యార్డ్ లో గోపి చిత్రపటానికి పూలమాలలు వేసి వర్ధంతిఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ మాట్లాడుతూ తిరందాసు గోపి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు గా యాదాద్రి భువనగిరి జిల్లా మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని, జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించార ని సంఘటిత అ సంఘటిత కార్మికుల యొక్క సమస్యలు పరిష్కరించడంలో అధికారులను మెప్పిచ్చి పరిష్కరించేవారు. గోపి గారు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలోని కార్మికులను నాయకులు గా తయారుచేయడం లో ను మంచి నైపుణ్యాలు అని కొనియాడా రు గోపి గత 9 సంవత్సరాల క్రితం రా మన్నపేట డిగ్రీ కాలేజీ వద్ద కారు ప్రమాదంలో మరణించడం జరిగింది గోపి మన మధ్య లేకపోవడం కార్మిక వర్గానికి తీరని నష్టమని అన్నారు. అనంతరం గోపి చిత్రపటంపై పూలు వేసి కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రా ధారపు మల్లేశ, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొం డె నరసింహ, హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జన్ని జంగయ్య, చేకూరి నాగేష్ గాడి పెల్లి నరసింహ భూష స్వామి రాములు నర్సింహ వీరస్వామి చంద్రయ్య వెంకటేశం నరసింహ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆడంబరాలకు దూరంగా సేవా దృక్పథం

- **విద్యార్థులకు ఉచితంగా నీటి సీసాల పంపిణీ**
- **కీ.శే. పజ్జూరి మణిపాల్ రెడ్డి ఆశయ సాధనే లక్ష్యం: మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి**

**కాప్రా,మార్చి 20(ప్రజాక్షేత్రం):**

కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) శుక్రవారం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి కుమార్తె పజ్జూరి కాష్యపి రెడ్డి జన్మదిన వేడుకలను పాఠశాల విద్యార్థుల మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆడంబరాలకు పోకుండా సమాజానికి ఉపయోగపడేలా, సేవా కార్యక్రమాలతో ఈ వేడుకలను జరపడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులకు అండగా పీఎంఆర్ సేవా సంస్థ ఈ సందర్భంగా పీఎంఆర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులందరికీ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన నీటి సీసాలను (వాటర్ బాటిల్స్) పంపిణీ చేశారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి తన కుమార్తె కాష్యపి రెడ్డితో కలిసి విద్యార్థులకు వీటిని అందజేశారు.వారసత్వాన్ని కొనసాగిస్తూ అనంతరం పావని మణిపాల్ రెడ్డి మాట్లాడుతూ తన కుమార్తె పుట్టినరోజును ఇలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్య జరుపుకోవడం, వారికి ఉపయోగపడే వస్తువులను అందించడం ఎంతో తృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పీఎంఆర్ ప్రతినిధులు మాట్లాడుతూ.. దివంగత నేత కీ.శే. పజ్జూరి మణిపాల్ రెడ్డి నిరంతరం ప్రజల సంక్షేమం కోసం, ముఖ్యంగా పేద విద్యార్థుల ఉన్నతి కోసం పరితపించేవారని కొనియాడారు. ఆయన ఆశయాలను, ఆశీస్సులను ముందుకు తీసుకెళ్లే బాధ్యతతోనే పీఎంఆర్ సేవా సంస్థ ద్వారా ఇలాంటి అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు వారు వివరించారు. కాష్యపి రెడ్డికి విద్యార్థులు,ఉపాధ్యాయులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం,పీఎంఆర్ సేవా సంస్థ ప్రతినిధులు,మట్ట రాజేశ్వర్ రెడ్డి,కరిపే ప్రవీణ్ వంజరి,పొద్దుటూరి గోవర్ధన్, నాగేశ్వర్ రెడ్డి ,సింగం రాజు, సంజీవ రెడ్డి,ప్రకాష్,అరుణ్, ఉమేష్,రాజేష్,సాయి నితీష్, రామ్,నిరుపం ,సాయి,సంతోష్, సూర్య, శ్రీకాంత్,తుషార్, ప్రకాష్, అమరేందర్ రెడ్డి,డి ఎస్ రావు, ఎస్ ఎం సాహెబ్,యాదగిరి రెడ్డి, సుబేదారెహమతుల్లా,సలీం, సుభాన్,షేక్ మహబూబ్ పేర,షేక్ దస్తగి,షేక్ జానే ఉస్మాన్,ఎం శేఖర్,స్థానిక నాయకులు, మహిళలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి పజ్జూరి కుటుంబం అందిస్తున్న సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.





## ప్రజాహితం మంత్రంగా బడ్జెట్.

- **అన్ని వర్గాలకు న్యాయం.**
- **వ్యవసాయం–సంక్షేమానికి భారీ కేటాయింపులు.**
- **ఎమ్మెల్యే మేఘారెడ్డి హర్షం.**

**వనపర్తి,మార్చి 20(ప్రజాక్షేత్రం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను అంచనా వేసి రూపొందించిన ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యం కల్పించిందని ఆయన పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ.3,24,234 కోట్ల బడ్జెట్ ప్రజాహితం దిశగా తీసుకున్న సమగ్ర నిర్ణయమని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించడం ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని అన్నారు. రైతు భరోసా, పంట బీమా వంటి పథకాలకు కేటాయింపులు రైతాంగానికి ఊరటనిస్తాయని చెప్పారు. అలాగే విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సామాన్య ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్, రోడ్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడం రాష్ట్ర పురోగతికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆరు గ్యారంటీల అమలుకు గణనీయమైన నిధులు కేటాయించడం ద్వారా పేద,మధ్య తరగతి కుటుంబాలకు నేరుగా లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. మహిళలు,విద్యార్థులు, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని,ఈ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు దృఢమైన బాటలు వేస్తుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పష్టం చేశారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి





- **కలెక్టర్ కార్యాలయం ముట్టడించిన బీజేపీ.**
- **23న అసెంబ్లీ ముట్టడికి హెచ్చరిక.**

**వనపర్తి,మార్చి 20 (ప్రజాక్షేత్రం):**


కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు ప్రధాన వాగ్దానాలను తక్షణమే అమలు చేసి రాష్ట్రంలోని నిరుపేదలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లా భారతీయ జనతా పార్టీ నాయకులు శుక్రవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు.అట్టడుగు వర్గాల పక్షాన బీజేపీ ఎప్పుడూ నిలుస్తుందని,కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు,వివిధ మండలాల అధ్యక్షులు,ముఖ్య నాయకులు, మోర్చాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హామీల అమలు వరకు తమ పోరాటం ఆగదని,మార్చి 23న రాష్ట్ర అసెంబ్లీని ముట్టడించి ప్రభుత్వాన్ని తలవంచే వరకు ఉద్యమం కొనసాగిస్తామని పార్టీ నాయకులు హెచ్చరించారు.

# రాజకీయాల్లో విలువలు పెంచాలి...

- **ఎండి. జహంగీర్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**

**వలిగొండ మార్చి 20(ప్రజాక్షేత్రం):**

రాజకీయాల్లో అధికార ప్రతిపక్షం రాజకీయ విలువల్ని మర్చిపోయి ఒకరిపై ఒకరు దుర్భసలాడుకోవడం రాజకీయ విలువల్ని కోల్పోయే విధంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం రోజున వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం జిల్లా కమిటీ చేపట్టిన ఇంటింటి సిపిఎం కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు రాజకీయ విలువలను కోల్పోయి దుర్భాషలాడుకోవడం దుర్మార్గమని ఇది రాజకీయాల్లో ప్రజా ప్రతినిధుల గౌరవాన్ని తగ్గిస్తుందని అన్నారు అనేక ప్రజా సమస్యలు పెండింగ్లో ఉన్నాయని వాటన్నిటిని గౌరవప్రదమైన చర్చల ద్వారా పరిష్కారం చేయాలి కొన్ని సందర్భాల్లో తాము ముఖ్యమంత్రి మరియు ఎమ్మెల్యేలను అనే విషయాలను కూడా మర్చిపోయి ఈ రకంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు గతంలో అనేకమంది ముఖ్యమంత్రిగా మంత్రులుగా ఎమ్మెల్యేలుగా పనిచేసి రాష్ట్రానికి గౌరవాన్ని తెచ్చిపెట్టారని ప్రస్తుతం తెలంగాణ ఏర్పడిన తర్వాత ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలకు దిగడం పార్లమెంటేతర భాషను వాడుతూ రాజకీయాలను అపహాస్యం చేస్తున్నారని ఇప్పటికైనా తమ భాషను మార్చుకొని ప్రజల సమస్యలపై చర్చించి వాటికి చూపాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు,మండల కార్యదర్శి సిర్పంగి స్వామి,పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు,సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్,నాయకులు కొండూరు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలు చిదరించుకొనేలా ఉన్నాయి.. సాయిబాబా ఎర్రవట్టి

**కామారెడ్డి జిల్లా మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో మీడియా సమావేశం లో పాల్గొన్న బీఆర్ఎస్వి మాజీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా ఎర్రవట్టి...శాసనసభలో సీఎం ప్రవర్తన వ్యాఖ్యలు తెలంగాణా ప్రజలు చిదరించుకొనే మాదిరిగా ఉన్నాయి.ప్రజల సమస్యల పై స్పష్టత ఇవ్వకుండా దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ప్రజా సమస్యలు సభ దృష్టికీ తీసుకొని వస్తావుంటే సభను దారి మళ్ళించి అడ్డగోలుగా విమర్శలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు తెలంగాణా ప్రజలు గమనిస్తవున్నారు.ప్రతి పక్ష నాయకుల మీద విమర్శలు కాదు..? ప్రజలకు ఇచ్చిన హామీల మీద దృష్టి పెట్టు. ప్రజల మన్నలు పొందు కానీ మా కెసిఆర్ పైన లేని పోనీ విమర్శలు చేస్తే తెలంగాణా ప్రజలు నిన్ను తరిమికొట్టె రోజులు వస్తాయి అదేవిధంగా మీ ఎన్నికల హామీలలో భాగంగా విద్యార్థులకు ఇచ్చిన ఫీజు రియాంబర్స్ మెంట్ నిధులు 8000 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ఈ బడ్జెట్ సమావేశం లో విద్యార్థుల కోసం దాదాపు 15 శాతం నిధులు కేటాయించి నీ పరువు నిలుపుకో. కానీ ఈ బడ్జెట్ సమావేశం లో నిధులు కేటాయించకుండా తూ తూ మంత్రాంగ పిచ్చి వేషాలు వేస్తే అసెంబ్లీనీ ముట్టడిస్తాం నీ ప్రభుత్వనీ ప్రజా క్షేత్రం లో ఎండగడుతాం..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ ల మీద హామీల మీద ప్రశ్నిస్తే జీర్ణించుకోలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్న నీకు ప్రజల నుంచి గుణపాఠం తప్పదు రైతుల సమస్యల కు ఇచ్చిన హామీల పైన పంట కొనుగోళ్లలో నిర్లక్ష్యం కనిపిస్తుంది అని అన్నారు ఈ కార్యక్రమం లో నచుపల్లి ఉప సర్పంచ్ శంకర్,నాగారం ఉపసర్పంచ్ సంజీవ్,ధోనకంటి ఆంజనేయులు,లక్ష్మణ్,అంజన్న.సాయిలు తదితరులు పాల్గొన్నారు.




# బాన్సువాడ ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**కామారెడ్డి జిల్లా మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఆర్ఎంపీ,పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా జె. గంగాధర్, అధ్యక్షులుగా తిరుమల గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, కోశాధికారిగా పోచ గౌడ్, ఉపాధ్యక్షులుగా విట్టల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా నగేష్, జిల్లా అధ్యక్షులుగా ఎన్. విఠల్, కార్యదర్శిగా దాసరి మాణిక్యం ఎన్నికయ్యారు.ఈ ఎన్నిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుద్దుల అంజి రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షుల సమక్షంలో జరిగింది.



# ఉగాది సందర్భంగా పంచాంగ సిద్ధాంతకర్త మనోహర్ శర్మకు ఘన సన్మానం.

- **పరాభవ నామ సంవత్సరంలో ప్రజలకు సుఖసంతోషాలు కలగాలి.**
- **మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి.**

**వనపర్తి,మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

ఉగాది పండగ సందర్భంగా పంచాంగ సిద్ధాంతకర్త మనోహర్ శర్మను మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి ఘనంగా సన్మానించారు.ప్రతి సంవత్సరం అనావాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని మనోహర్ శర్మ నివాసంలో మనోహర్ శర్మతో పాటు ఆయన కుమారుడు నాగరాజు శర్మను అభినందించారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ,మన సంస్కృతి,సాంప్రదాయాలను కాపాడుతూ ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే పంచాంగాన్ని రూపొందించడం గొప్ప విషయం అని కొనియాడారు.పంచాంగం ద్వారా ప్రజలకు దిశానిర్దేశం లభిస్తుందని, ఇది సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్,పలుస శంకర్ గౌడ్,ప్రేమ్ నాథ్ రెడ్డి,ఎం.డి.గౌస్, నందిమల్ల రమేష్,కిషోర్ కుమార్ రెడ్డి, పార్థసారథి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# చీరాలలో డాక్టర్ అగర్వాల్ కంటి హాస్పిటల్ ను ప్రారంభించిన మద్దులూరి మాల కొండయ్యా

**చీరాల,మార్చి 20(ప్రజాక్షేత్రం):**


చీరాల పట్టణం పొలిమేర రోడ్డులోని పులి ప్యాలెస్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ అగర్వాల్ కంటి హాస్పిటల్ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కటింగ్ తో ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొనీ, తర్వాత కంటి వైద్య పరీక్షల నిమిత్తం చీరాల ఎమ్మెల్యే కూడా ముత్య పరీక్షలు చేసుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మపత్ని బాల కొండమ్మతో పాటు, చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్ పాల్గొన్నారు. ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన కంటి ఆసుపత్రి ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ముఖ్యంగా కంటి సంబంధిత వ్యాధుల చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ కంటి హాస్పటల్ డాక్టర్ రాచనపల్లి కల్పనా రెడ్డి, శ్రీకాంత్ మేక, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పులి వెంకటేశ్వర్లు,స్థానిక నాయకులు, వైద్యులు,పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అంగరంగ వైభవంగా శ్రీ శ్రీ శ్రీ తారపురం గిడ్డాంజినేయ స్వామి రథోత్సవం.

**పెద్దకడుబూరు మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

పెద్దకడబూరు మండల పరిధిలోని తారపురం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ తారపురం గిడ్డాంజినేయస్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రము 6గంటల ప్రాంతంలో అంగరంగా వైభవంగా అశేష భక్త జన వాహినుల మద్య రథోత్సవం కొన సాగింది. ముందుగా స్వామి వారికి ఉదయం 7గంటలనుండి మద్యాహ్నం 1గంట వరకు స్వామి వారికి ఆకుపూజా. కుంక మార్చన. జలాభిషే కం. పంచామృతాభిషేకము వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6గంటల ప్రాంతంలో గౌళ్ళ చిన్న వీరారెడ్డి స్వగృహం నుంచి పూర్ణకుంభంతో మేళాతాళలతోను డప్పులు డ్రమ్ముసులతో గ్రామం పురవీధులగుండా ఊరేగిస్తూ స్థానిక దేవాలయం వద్ద ఉన్న పుష్ప రథంపై శ్రీ గిడ్డాంజినే స్వామి ప్రతిమను ఉంచి రథోత్సవం నకు భక్తులు నైవేద్యములు సమర్పించిన ఆనంతరం. వేలాది మంది భక్తులు మద్య రథాన్నిస తిక్కతాత ఆలయం వరకు లాగి మళ్ళీ యధాస్థానం లో ఉంచారు.ఈరథాన్ని తిలకించేందుకు కర్నాటక ఆంధ్ర రాష్ట్రలతో పాటు గ్రామం చుట్టూ ప్రక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ తమ మొక్కలను తీర్చుకున్నారు. ఈ రథోత్సవం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మారుతి అద్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహిం చారు.ఈ రథోత్సవం కార్యక్రమంలో నరవరమా కాంతరెడ్డీ.భరత్ కుమార్ స్వామి కౌసిక్ మీసేవా ఆంజనే యులు హరిశ్చంద బోగ్గుల నరసన్న వైసీపీ నాయకులు రామిరెడ్డి ఆలయ అదికారి ఈవో సాయితేజ ఆలయ పూజారి బసవరాజు ఆలయ సిబ్బంది. అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజాపాలన ప్రగతి దిశగా దూసుకెళ్తున్న వనపర్తి మున్సిపాలిటీ




- **పన్నుల వసూళ్లలో 100% సాధనకు కృషి.**

**వనపర్తి మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వనపర్తి మున్సిపాలిటీ శుక్రవారం పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం,ఆదాయ వనరుల పెంపు లక్ష్యంగా చేపట్టిన చర్యల్లో భాగంగా ఆస్తి పన్ను, నీటిపన్ను, లైసెన్స్ ఫీజుల వసూళ్లలో అధికారులు 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్,మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. పట్టణ ప్రజల సహకారంతో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని కోరారు.సిబ్బందిని పురామాయించి,వసూళ్ల పెరుగుదలతో మున్సిపాలిటీ ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందని, అభివృద్ధి పనులు మరింత వేగంగా అమలు చేయడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఇకపోతే,డంపింగ్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కంపోస్ట్ యూనిట్‌ను మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్,కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు,అధికారులు పరిశీలించారు.వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆదాయ వనరులను కూడా పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మాధవి రమేష్ తెలిపారు. అదేవిధంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై సమగ్రంగా సమీక్ష నిర్వహించి,అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పరుశురాం,ఎస్ ఎల్ ఎన్ రమేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వార్డ్ అధికారులు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అగ్ని బాధిత కుటుంబాలకు రెడ్ క్రాస్ సహాయం

**చీరాల,మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

పట్టణ పరిధిలోని గొల్లపాలెం సచివాలయం సమీపంలో కుందేరు వెంబడి తాత్కాలిక నివాసాల్లో ఉంటున్న నక్కల కులస్తుల ఏడు కుటుంబాలు గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయాయి. ఈ సమాచారం అందుకున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చీరాల సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు అత్యవసర సహాయం అందించింది. మొత్తం 40 రకాల వంట సామాగ్రి, టార్పాలిన్ పట్టాలు, పెద్ద సైజు దుప్పట్లు పంపిణీ చేసినట్లు చైర్మన్ బూదరాజు శశి కిరణ్ తెలిపారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, విపత్తుల సమయంలో అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైతే మరింత సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రమాద సమాచారాన్ని అందించిన భగవాన్ దాస్‌ను రెడ్ క్రాస్ అభినందించింది. అలాగే తక్షణ సహాయం అందించినందుకు రెడ్ క్రాస్ సంస్థకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి జి.ఏ.వి. ప్రసాద్, జిల్లా యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ మన్నారాయణ,డి.బి.ఆర్.సి ఏరియా కోఆర్డినేటర్ వి.భగవాన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
21.03.2026
శనివారం | హైదరాబాద్

# కనబడుటలేదు

**కోటగిరి మార్చి 20 (ప్రజాక్షేత్రం):**



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో జల్లపల్లి ఫారం గ్రామం నికి చెందిన రసూల్ ఖాన్ తండ్రి పేరు అభి ఖాన్ 44 సంవత్సరాలు జల్లపల్లి ఫారం నివాసి గత నాలుగు రోజులు నుండి కనబడుటలేదు తల్లి దండ్రులు భార్య పిల్లలు ఆవేదనకు గురి అవుతున్నారని మిస్సింగ్ కేసు నమోదు చేసినారు వివరాలు తెలిపిన ప్రకారం గత నాలుగు రోజుల నుండి ఇంటి బయటకు వెళ్లి ఇప్పటి వరకు ఇంటికి రాలేదని తల్లిదండ్రులు భార్య చెప్పి కేసు నమోదు చేసినారు ఇతని ఆచూకీ వెంటనే తెలుసుకోవాలని భార్య తల్లిదండ్రులు కేసు నమోదు చేసి వివరాలు తెలియజేశారు కోటగిరి ఎస్సై సునీల్ కేసు నమోదు చేశామని తెలియజేశారు.

## విద్యార్థులతో కలసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్,సబ్ కలెక్టర్ కిరణ్మయి

**కామారెడ్డి జిల్లా మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం జుక్కల్ మండలంలో పర్యటించి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ముందుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం కింద జుక్కల్ మండలంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల పనుల పురోగతిని సబ్ కలెక్టర్ కిరణ్మయి తో కలిసి పరిశీలించారు. నిర్మాణ నాణ్యత, పనుల వేగం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులనుఆదేశించారు.తదనంతరం ఆక్సిజన్ పార్క్‌ను సందర్శించి అక్కడి అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్క్‌లో వృక్షాల సంరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.ఆపై కేజీబీవీ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు.ఈ రోజు మెనూలో క్యారెట్ కర్రీ, సాంబారు,టమాట చారు, కోడి గుడ్డు,పెరుగు,నెయ్యి అందిస్తున్నట్లు గమనించారు.ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి,వారితో ముచ్చటిస్తూ వారి విద్య,వసతి,ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఇందులో పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి,డీఈఓ రాజు,డిపిఓ మురళి,తహసిల్దార్, సంబంధిత అధికారులు,తదితరులు ఉన్నారు.జిల్లా పౌర సంబంధాల అధికారిణి కామారెడ్డి జిల్లా జారీ చేయనైనది.



## సర్పంచ్ పదవీ ముగిసిన ఎప్పటికీ ప్రజలకు అండగా ఉంటా

- **వైసీపీ తుంబకుప్పం సర్పంచ్ లీలవతమ్మ**
- **ఐదు సంవత్సరాలు నాతో కలసి నడచిన నా గ్రామ ప్రజలకు, యువతకు,ఎప్పటికి రుణపడి ఉంటా.**
- **తుంబకుప్పం కాలనీ ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా వైయస్సార్సీపీ యువ నాయకులు మంజునాథ్**

**బంగారుపాళ్యం మార్చి 20(ప్రజాక్షేత్రం)**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం, తుంబకుప్పం గ్రామ సర్పంచి లీలావతమ్మ గురువారం ఉగాది పర్వదినాన స్థానిక పంచాయతీలోని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ముగిసింది పదవీ కాలం మాత్రమే కానీ నాలో సేవాభావం, సేవా గుణం కాదు, ఊపిరి ఉన్నంత వరకు గ్రామ ప్రజలకు అండగా ఉంటానని, మీకు ఏ చిన్న సమస్య వచ్చినా నా ఇంటి తలుపు ఎప్పుడు తెరిచే ఉంటుందని ఆమె పత్రిక ముఖంగా తెలిపారు.నాకు అండగా నిలిచిన సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు, ధన్యవాదాలు, తెలుపుతున్నట్లు తెలియజేశారు. వైయస్ఆర్సీపీ గ్రామ యువ నాయకులు మంజునాథ్ మాట్లాడుతూ, ముఖ్యంగా నా యువతకు, నా టీమ్ కి ఎప్పటికీ రుణపడి ఉంటానని నాకు తెలిసి తెలియక ఎవరినైనా నొప్పించి ఉంటే మన్నించాలని తెలిపారు. గ్రామ & వార్డ్ అభివృద్ధికి , వ్యక్తిగతంగా నాకు అండగా ఎం.కె.విద్యా సాగర్ రెడ్డి కుటుంబానికి, ముఖ్యంగా కాలనీ ప్రజలకి & గ్రామ ప్రజలకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 2029 వ సంవత్సరంలో జరగబోయే స్థానిక ఎన్నికలలో, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యేదాకా ప్రజల కోసం పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తానని ముక్త కంఠంతో స్పష్టం చేస్తున్నట్లు తెలిపారు.





# గిరిజన ద్రోహి కాంగ్రెస్ సర్కార్:బడ్జెట్ సాక్షిగా నయవంచన!

- **గిరిజన ద్రోహి కాంగ్రెస్ సర్కార్:బడ్జెట్ సాక్షిగా నయవంచన!**
- **మార్చి 25న అసెంబ్లీ ముట్టడి.. గర్జిస్తున్న లంబాడి హక్కుల పోరాట సమితి**

**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 20(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ గిరిజనుల పాలిట శాపంగా మారిందని, ఇది పూర్తిగా "ప్రజా వ్యతిరేక బడ్జెట్" అని లంబాడి హక్కుల పోరాట సమితి నిప్పులు చెరిగింది. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ గొప్పగా ప్రకటించిన 'ఎస్సీ, ఎస్టీ చేవెళ్ల డిక్లరేషన్' అటకెక్కిందని, గిరిజనులను నిండా ముంచడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని రాష్ట్ర కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

**అంకెలేమో వేల కోట్లు..**
**ఖర్చు చేసేది మాత్రం శూన్యం!**

బడ్జెట్ కేటాయింపులపై ప్రభుత్వం ఆడుతున్న నాటకాలను సమితి బట్టబయలు చేసింది. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 40 శాతం కూడా ఖర్చు చేయని చేతగాని ప్రభుత్వం, ఇప్పుడు మళ్ళీ రూ. 7,937 కోట్లు కేటాయించామని చెప్పడం గిరిజనులను మోసం చేయడమేనని మండిపడింది. గతంలో కేటాయించిన నిధుల్లో రూ. 2,000 కోట్లు కూడా ఖర్చు చేయకుండా, కొత్త అంకెలతో మాయమాటలు చెబుతున్నారని నాయకులు ధ్వజమెత్తారు.

**తీరని అన్యాయం.. పక్కన పెట్టిన హామీలు!**

ఆరు గ్యారంటీల పేరుతో ఊదరగొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, గిరిజనుల ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని సమితి ఆవేదన వ్యక్తం చేసింది. ప్రధానంగా: రాజకీయ వివక్ష: రాష్ట్ర క్యాబినెట్‌లో లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం గిరిజన సమాజాన్ని అవమానించడమే. నిర్లక్ష్యం: సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలన్న డిమాండ్‌ను తుంగలో తొక్కారు. రెవెన్యూ గ్రామాలు: గిరిజన తండాలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా మార్చే ప్రక్రియలో ప్రభుత్వం మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటి? చేవెళ్ల డిక్లరేషన్: అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న డిక్లరేషన్ హామీలు ఇప్పుడు గాలికి వదిలేశారని నాయకులు విమర్శించారు. ఇది గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే బడ్జెట్. నిధులు ఇవ్వకుండా, నీతులు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గిరిజన బిడ్డలు తగిన బుద్ధి చెబుతారు." — లంబాడి హక్కుల పోరాట సమితి. మార్చి 25న చలో అసెంబ్లీ! ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా లంబాడి హక్కుల పోరాట సమితి, సేవాలాల్ సేన, బంజారా సేవా సంఘం సంయుక్తంగా పోరాటాన్ని ఉధృతం చేశాయి. మార్చి 25న అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ భారీ ముట్టడిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనులు, బంజారాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమితి పిలుపునిచ్చింది. తమ డిమాండ్లు నెరవేరే వరకు, చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేసే వరకు విశ్రమించేది లేదని, గిరిజన గర్జనతో అసెంబ్లీని స్తంభింపజేస్తామని నాయకులు హెచ్చరించారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీల్లోకి కొత్తనియామకాలు, బాలకృష్ణ, నాగరాజులకు పదవులు

**కామారెడ్డి జిల్లా మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణానికి చెందిన నూతనంగా నియమించిన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కాంగ్రెస్ పార్టీ కమిటీలలో మాజీ శాసనసభ్యులు ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో పార్టీ జెండా మోసిన వారికి ముఖ్య పదవులు దక్కాయి. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత బాలకృష్ణ కామారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా, తృప్తి నాగరాజు జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు సుదర్శన్గౌడ్,కె.అరుణ్,ఎడ్ల గంగారాం,వడ్ల హన్మాండ్లు,యెల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## బాన్సువాడలో శ్రీ హనుమాన్ దీక్ష స్వాములు మహా మండలం పూజకు పిలుపు.

**కామారెడ్డి జిల్లా మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయం ఆవరణలో శనివారం రోజున నిర్వహించే 17వ శ్రీ హనుమాన్ దీక్ష స్వాముల మహా మండల పూజను భక్తులు శ్రీ హనుమాన్ దీక్ష స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అఖిలభారత శ్రీ హనుమాన్ దీక్ష సేవాసమితి గురు స్వాములు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ మార్చి 21న శనివారం విశ్వశాంతి కొరకు అష్టోత్తర శత కుండాత్మ(108) సుందరకాండ పారాయణ సహిత 162 వ శ్రీ హనుమాన్ మహా యజ్ఞం, శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, వడల పూజ మహోత్సవం చేపట్టుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సుందరకాండ పారాయణ సహిత మహా యజ్ఞం మార్చ్ 21 న శనివారం నాడు ప్రారంభమై 22 ఆదివారం మధ్యాహ్నం ఒంటి వరకు నిర్విరామంగా కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. ఈ ఈ కార్యక్రమంలో శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి బాన్సువాడ ప్రతినిధులు అంబిలిపూర్ రాజు స్వామి,పాలకుర్తి దత్తు స్వామి,సాయ గౌడ్ స్వామి,గోకన్ శంకర్ గౌడ్ స్వామి, తేలి మహేష్ కుమార్ స్వామి,కల్లేటి వెంకటరమణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



## వనపర్తి జిల్లా కాంగ్రెస్ కొత్త కార్యవర్గం నియామకం.

- **ఉపాధ్యక్షులుగా సాయి చరణ్ రెడ్డి,తిరుపతయ్య.**
- **ప్రధాన కార్యదర్శులుగా ధనలక్ష్మి, బ్రహ్మయ్య చారి,ఎల్ సతీష్, గణేష్ గౌడ్,సత్యారెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి.**
- **అధికార ప్రతినిధులుగా జనార్ధన్ సాగర్,కోళ్ల వెంకటేష్,రమేష్ గౌడ్.**
- **నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి.**

**వనపర్తి,మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకత్వం ఉగాది పర్వదినం సందర్భంగా ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలో పార్టీ పునర్వ్యవస్థీకరణ జరగగా పలువురు నేతలకు కీలక బాధ్యతలు అప్పగించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా గణపురం మండలానికి చెందిన సాయి చరణ్ రెడ్డి, వనపర్తి మండలానికి చెందిన తిరుపతయ్యలను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా 21వ వార్డు కౌన్సిలర్ పి. ధనలక్ష్మి, ఎల్. సతీష్ కుమార్, బ్రహ్మయ్య చారి, కొత్తకోట మండలానికి చెందిన పాపయ్య గారి కృష్ణారెడ్డి, గోపాల్‌పేట మండలానికి చెందిన గుండ్రాతి గణేష్ గౌడ్, పెద్దమందడి మండలం ఇటికెల సత్యారెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. అదే విధంగా అధికార ప్రతినిధులుగా జి శరవంద, కోళ్ల వెంకటేష్, చీర్ల జనార్ధన్, కె. రమేష్ గౌడ్‌లకు బాధ్యతలు కట్టబెట్టారు. కార్యదర్శులుగా వనపర్తికి చెందిన బి. కృష్ణతో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురిని నియమించారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు.





## నాని మిగడాలు రచయితగ కవి గానం వినిపించిన నాగం సాయిలు

**కోటగిరి మార్చి 20 (ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో హెగ్డోలి గ్రామానికి చెందిన నాగం సాయిలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిఖిల్ సాయి ఇంటర్నేషనల్ హోటల్లో శ్రీ నాగభూషణం గుప్త ఏర్పాటు చేసిన శ్రీ పరమ భవనామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనంలో జిల్లా నలుమూలల నుండి కవులు పాల్గొనడం జరిగింది పోతంగల్ మండల వాసి హెగ్డోలి గ్రామానికి చెందిన నాని మీ గడలు కవి రచయిత నాగం సాయిలు కవి గానం వినిపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ కాసర్ల నరేష్ వెంకటరమణ చర్య గంటల ప్రసాద్ మొద్దుకూరి సాయిబాబు



## రాత్రిపూట తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న కోటగిరి మండల ఎస్సై సునీల్

**పొతంగల్ మార్చి 20(ప్రజాక్షేత్రం):**

నిజాంబాద్ జిల్లా పొతంగల్ మండల కేంద్రంలో రాత్రిపూట అక్రమ రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు ట్రాక్టర్ల నంబర్లుTS 16UB224.TG16T5043 రెండు టాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ట్రాక్టర్లు పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు ఎవ్వరైనా సరే అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కోటగిరి మండలం ఎస్సై సునీల్ తెలియజేశారు.







## మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- **ఉపసర్పంచ్ నర్సనోల్ల జయంత్ చొరవ**
- **గోపులారం 7వ వార్డులో నీటి సమస్య పరిష్కారం**

**శంకర్ పల్లి, మార్చి 20(ప్రజాక్షేత్రం):**

గోపులారం గ్రామం 7వ వార్డులో నెల కొన్న మంచినీటి సమస్యకు ఉపసర్పంచ్ నర్సనోల్ల జయంత్ తక్షణ చర్యలు తీసుకుని పరిష్కారం చూపించారు. గత కొన్ని రోజులుగా వార్డులోని బోరు పనిచేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను 7వ వార్డు సభ్యుడు బేగారి వినోద నర్సింలు ఉపసర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యపై స్పందించిన ఉపసర్పంచ్ నర్సనోల్ల జయంత్ వెంటనే అవసరమైన సామగ్రి అందించి బోరును మరమ్మతు చేయించి, ప్రజలకు మళ్లీ మంచినీటి సరఫరా ప్రారంభం అయ్యేలా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన ప్రజల ఆశలు నెరవేర్చడం తన బాధ్యత అని, ప్రతి వార్డులో సమస్యల పరిష్కారానికి ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బేగారి వినోద నర్సింలు, నర్సనోల్ల దయాకర్, తొండ కల్పన గొట్టయ్య, సిబ్బంది, అలాగే గ్రామస్థులు నర్సనోల్ల శ్రీధర్, వంక రవి పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



- **మొయినాబాద్‌లో భగీరథ పనుల ప్రారంభం**

**మొయినాబాద్ మార్చి 20(ప్రజాక్షేత్రం)**

మొయినాబాద్ మున్సిపాలిటీ 16వ వార్డ్‌లో మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ పనులకు కౌన్సిలర్ జంగం గీత వనజాక్షి సంజీవరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ సోనీ దర్శన్ హాజరై పనులను ప్రారంభించారు. వైస్ చైర్మన్ రాజు, కౌన్సిలర్ మమత మోహన్ రెడ్డి, పావని జగన్మోహన్ రెడ్డి, అరుణ రామకృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సరికొండ అంత్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సంజీవరావు, యాదయ్య, పి. కుమార్, విజయనగర్ కాలనీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.



## సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్, మార్చి 20 ( ప్రజాక్షేత్రం ):**

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన 62 కుటుంబాలకు వైద్య సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది.ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, పేద ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యుల ద్వారా నాణ్యమైన చికిత్స అందుబాటులో ఉందని, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు తెచ్చుకోవద్దని సూచించారు.



## పారదర్శకంగా 10వ తరగతి నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి

- **అధికారుల ఆదేశించిన కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 20(ప్రజాక్షేత్రం):**






10వ తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ నుండి 10వ తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు జూమ్ మీటింగ్ ద్వారా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరీక్షలు సజావుగా జరిగేలా, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షల్లో విధులు నిర్వహించే సిబ్బంది వద్ద పరీక్షలు నిర్వహించే ప్రాంగణంలో మొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి బయట వ్యక్తులను రాకుండా కట్టడి చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించేముందు ఏఎన్ఎం, పోలీస్ బందోబస్తు, వాటర్ బాయ్ లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను జీరో మొబైల్ జోన్ గా ఉంచే బాధ్యత చీఫ్ సూపరిండెంట్లదేనని కలెక్టర్ తెలిపారు. రోజువారి డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నపత్రం పేపర్ సీరియల్ నెంబర్ రిజిస్టర్ లను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్ర పరిసరాలు పరిశుభ్ర వాతావరణంలో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే సీసీఏ రూల్స్ మేరకు చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుండి జూమ్ మీటింగ్ లో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి,డిఇఓ రేణుకా దేవి లు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర ఉగాది అందరికీ మంచి జరగాలి

- **రావిరాల గ్రామంలో ఉగాది వేడుకలు నిర్వహించిన సమత సేవా సొసైటీ ఫౌండర్ చైర్మన్ గోనెమోని మంజు కుమార్**

**మహేశ్వరం, మార్చి 20(ప్రజాక్షేత్రం)**



మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమత సేవా సొసైటీ ఫౌండర్ చైర్మన్ గోనెమోని మంజుకుమార్ మాట్లాడుతూ రావిరాల గ్రామంలో గత 5 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా మన తెలుగ సంవత్సరం పరాభవ నామ, సంవత్సరం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా గ్రామ పెద్దలతో కలిసి మన సాంప్రదాయబద్ధంగా చెద్రుచుల తొ పచ్చడ చేసి గ్రామ పెద్దలకు ఇవ్వడం జరుగుతుంది. కొత్త సంవత్సరం పండుగను ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగను తెలుగు వారి సాంస్కృతి సాంప్రదాయాలకు ఆదర్శంగా ఉగాది పండుగను నిర్వహించడం జరుగుతుందని కుమార్ తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా నిర్విరామముగా జరుగుతుందని అందుకు స్థానిక ప్రజలు పెద్దలు సహకరిస్తున్నారని అందరి సహకారంతో ఉగాది పచ్చడి తెలుగువారి పండుగను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిగ ఈ సంవత్సరం కూడా ఉగాది పండుగను వైభవంగా నిర్వహించడం జరిగిందని కుమార్ తెలిపారు.

## వీధిలో కుక్కల బెడదతో భయాందోళన

- **మండలంలో కుక్కల దాడులు**

**పెద్ద కొడప్‌గల్ మార్చి 20(ప్రజాక్షేత్రం)**



కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలం బూరుగుపల్లి గ్రామంలోని ఎస్సీ వీధిలో ఉల్లి రామయ్యకు చెందిన మేకల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో కొన్ని మేకలు తీవ్రంగా గాయపడ్డాయి. సమాచారం అందుకున్న గోపాలమిత్ర రవీందర్ ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన మేకలకు ప్రాథమిక చికిత్స అందించారు. మేకలకు తీవ్రమైన గాయాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇక గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల పెద్ద కొడప్‌గల్‌లో కుక్క కాటు ఘటన కూడా చోటుచేసుకోవడంతో బయటకు రావడానికే భయపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### విస్తరాకుల దుకాణాన్ని ప్రారంభోత్సవం చేసిన

## పోతుగల్ సర్పంచ్ పామేనా నర్సింహులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 20(ప్రజా-క్షేత్రం):**




రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని నాగారగూడ గ్రామములో నిరుద్యోగులు ఏర్పాటు చేసిన విస్తరాకుల దుకాణాన్ని నాగర్ గూడ సర్పంచ్, బండ స్వరూప మహేందర్ గౌడ్, పోతుగల్ సర్పంచ్ పామేనా నర్సింలు నరసింహులు, ముఖ్య అతిథులుగా పాల్గొని, పామెనా నరసింహులు ఇస్తరాకుల దుకాణాన్ని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం పోతుగల్ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడంతో ఎంతో ముఖ్యం అని పేర్కొన్నారు, ఇలాంటి చిన్న తరహా వ్యాపారాలు, గ్రావినాభివృద్ధికి ఎంతో దోహదపడటంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇలాంటి చిన్న వ్యాపారాలు, గ్రామ అభివృద్ధికి దోహదపడటంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని పేర్కొన్నారు, ఈ నూతన దుకాణాన్ని షాబాద్ మండలంలోని గోపిగడ్డ గ్రామానికి చెందిన శిరసాల సత్యనారాయణ, మరియు జోసెఫ్, స్థాపించడం పట్ల సర్పంచ్ ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**: టెండరు ప్రకటన :**

ఏలూరుజిల్లా , చాట్రాయి మండలంలోని జనార్ధనవరం గ్రామ పంచాయితీలో 1-04-2026 నుండి 31-03-2027 వరకు పని చేయుటకు టెండర్ల ద్వారా ఆహ్వానించటమైనది.

| వ. సంఖ్య | పని వివరం | వ్యక్తుల సంఖ్య |
|---|---|---|
| 1. | శానిటరీ వర్కర్ | - 1 |
| 2. | స్వీపర్ | - 1 |
| 3. | వాటర్ ట్యాంక్ ఆపిరేటర్ | - 2 |
| 4. | ఎలక్ట్రీషియన్ | - 1 |
| 5 | ప్లంబర్ | - 1 |

ది. 25-03-2026 వ తేదీన గ్రామ సచివాలయం నందు టెండర్లు తెరవబడును.

గ్రామ సర్పంచ్ : **పామర్తి ఝాన్సీరాణి** జనార్ధనవరం
గ్రామ కార్యదర్శి : **హరి హనుమంతరావు** జనార్ధనవరం

**: టెండరు ప్రకటన :**

ఏలూరుజిల్లా , చాట్రాయి మండలంలోని ఆరుగొలనుపేట గ్రామ పంచాయితీలో 1-04-2026 నుండి 31-03-2027 వరకు పని చేయుటకు టెండర్ల ద్వారా ఆహ్వానించటమైనది.

| వ. సంఖ్య | పని వివరం | వ్యక్తుల సంఖ్య |
|---|---|---|
| 1. | స్వీపర్ | - 1 |
| 2. | వాటర్ ట్యాంక్ ఆపిరేటర్ | - 1 |
| 3. | ఎలక్ట్రీషియన్ | - 1 |
| 4. | ప్లంబర్ | - 1 |

ది. 25-03-2026 వ తేదీన గ్రామ సచివాలయం నందు టెండర్లు తెరవబడును.

గ్రామ సర్పంచ్ : **పుచ్చకాయల అప్పిరెడ్డి** ఆరుగొలనుపేట
గ్రామ కార్యదర్శి : **హెచ్చు సూర్యనారాయణ** ఆరుగొలనుపేట

**: టెండరు ప్రకటన :**

ఏలూరుజిల్లా , చాట్రాయి మండలంలోని తుమ్మగూడెం గ్రామ పంచాయితీలో 1-04-2026 నుండి 31-03-2027 వరకు పని చేయుటకు టెండర్ల ద్వారా ఆహ్వానించటమైనది.

| వ. సంఖ్య | పని వివరం | వ్యక్తుల సంఖ్య |
|---|---|---|
| 1. | స్వీపర్ | - 1 |
| 2. | వాటర్ ట్యాంక్ ఆపిరేటర్ | - 4 |
| 3. | ఎలక్ట్రీషియన్ | - 1 |
| 4. | ప్లంబర్ | - 1 |

ది. 25-03-2026 వ తేదీన గ్రామ సచివాలయం నందు టెండర్లు తెరవబడును.

గ్రామ సర్పంచ్ : **మొలుగుమాటి మారెమ్మ** తుమ్మగూడెం
గ్రామ కార్యదర్శి : **హెచ్చు సూర్యనారాయణ** తుమ్మగూడెం

**: టెండరు ప్రకటన :**

ఏలూరుజిల్లా , చాట్రాయి మండలంలోని పోలవరం గ్రామ పంచాయితీలో 1-04-2026 నుండి 31-03-2027 వరకు పని చేయుటకు టెండర్ల ద్వారా ఆహ్వానించటమైనది.

| వ. సంఖ్య | పని వివరం | వ్యక్తుల సంఖ్య |
|---|---|---|
| 1. | శానిటరీ వర్కర్ | - 2 |
| 2. | స్వీపర్ | - 2 |
| 3. | వాటర్ ట్యాంక్ ఆపిరేటర్ | - 2 |
| 4. | ఎలక్ట్రీషియన్ | - 1 |
| 5 | ప్లంబర్ | - 1 |

ది. 25-03-2026 వ తేదీన గ్రామ సచివాలయం నందు టెండర్లు తెరవబడును.

గ్రామ సర్పంచ్ : **సత్తెనపల్లి లక్ష్మి** పోలవరం
గ్రామ కార్యదర్శి : **హరి హనుమంతరావు** పోలవరం

## నేడే రంజాన్ పండుగ జరుపుకోవాలని డబ్ల్యూ హెచ్ ఆర్ పి సి సి జాతీయ నాయకుడు డాక్టర్ జాకీర్ షరీఫ్ వెల్లడి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 20(ప్రజాక్షేత్రం):**

గత నెల రోజుల నుండి ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులు, ఈద్‌ఫితర్,.. ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అశ్వక్ అలీ, రంగారెడ్డి జిల్లా హెల్త్ డైరెక్టర్, డాక్టర్ కాజా పాషా, లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు, రాష్ట్రంలోని ముస్లిం సోదరులందరూ రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని వారు ఒక ప్రకటనలో ముస్లిం సోదరులను కోరారు.



# యుద్ధం అక్కడ... వంటగదిలో మంట ఇక్కడ!

- పశ్చిమాసియా యుద్ధం.. భారత్లో సామాన్యుడిపై ధరల భారం!
- హర్మ్యూజ్ సంక్షోభంతో మండిపోతున్న గ్యాస్, పెట్రోల్ ధరలు
- వంట గ్యాస్ పై రూ. 60 వాత.
- పెట్రోల్, డీజిల్ ధరల్లో 40 శాతం వరకు పెరుగుదల
- విమాన ప్రయాణాలపై 'సర్ఛార్జ్' భారం

**నేషనల్ బ్యూరో మార్చి 20(ప్రజాక్షేత్రం):**

ఫిబ్రవరి 28న మొదలైన పశ్చిమాసియా యుద్ధం కేవలం మూడు దేశాలకే పరిమితం కాలేదు. దాని సెగ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఇంటా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రపంచ ఇంధన రవాణాకు గుండెకాయ వంటి 'హర్మ్యూజ్ జలసంధి'లో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి.

**నిశ్శబ్దమైన సముద్ర మార్గం**

ఒకప్పుడు నిత్యం 100కు పైగా నౌకలతో కళకళలాడే హర్మ్యూజ్ జలసంధి ఇప్పుడు వెలవెలబోతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో రోజుకు సగటున 83 నౌకలు ప్రయాణించగా, ఈ ఏడాది యుద్ధానికి ముందు ఆ సంఖ్య 106కు చేరింది. కానీ, యుద్ధం మొదలైన తర్వాత మార్చి మొదటి వారం నాటికి ఇది కేవలం 6 నౌకలకు పడిపోవడం గమనార్హం. ఈ మార్గం మూతపడటంతో సహజ వాయువు ధరలు ఒక్కసారిగా 10 శాతం పెరిగి, యూనిట్‌కు 3.2 డాలర్లకు చేరుకున్నాయి.

**దేశాల వారీగా ఇంధన మంట**

ఎన్డీటీవీ సేకరించిన సమాచారం ప్రకారం.. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 మధ్య పెట్రోల్ ధరలు ఆస్ట్రేలియాలో 32 శాతం, అమెరికాలో 24 శాతం, సింగపూర్‌లో 21 శాతం మేర పెరిగాయి. డీజిల్ ధరల పరిస్థితి మరీ దారుణం. ఆస్ట్రేలియాలో అత్యధికంగా 40 శాతం పెరుగుదల నమోదు కాగా, సింగపూర్ (34 శాతం), అమెరికా (33 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, భారత్, బ్రెజిల్ వంటి దేశాల్లో ప్రభుత్వ నియంత్రణ వల్ల ధరలు స్థిరంగా ఉండటం సామాన్యులకు ఊరటనిచ్చే అంశం.

**వంటగ్యాస్ నుంచి విమాన ప్రయాణం దాకా**

వంటగ్యాస్ (ఎల్ పి జి) ధరల్లో కూడా భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. గ్రీస్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో ఎల్పీజీ ధరలు ఆకాశాన్ని తాకగా, రష్యా, సౌదీ వంటి ఉత్పత్తి దేశాల్లో తక్కువగా ఉన్నాయి. ఇక విమాన ప్రయాణికులపై కూడా ఈ భారం పడింది. విమాన ఇంధన ధరలు పెరగడంతో ఎయిర్ ఇండియా (రూ. 399), ఇండిగో (రూ. 425) వంటి సంస్థలు ఇప్పటికే 'ఫ్యూయల్ సర్ఛార్జ్'ను విధిస్తున్నాయి. ఆకాశ ఎయిర్ అయితే ఏకంగా రూ. 1,300 వరకు అదనపు భారాన్ని మోపుతోంది.

**భారత్‌లో వంటగ్యాస్ ధర పెంపు**

ఎన్డీటీవీ పేర్కొన్నట్టుగానే, అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతినడంతో భారత్‌లో కూడా ప్రభావం మొదలైంది. మార్చి 7 న దేశీయ వంటగ్యాస్ (ఎల్ పి జి) సిలిండర్ ధరపై కేంద్రం రూ. 60 మేర పెంచింది. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 913కి చేరింది. అటు అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటడం గమనార్హం.





## పిపిఎల్ సీజన్–4లో క్రీడాకారులకు ఘన సత్కారం

**మొయినాబాద్, మార్చి 20(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద మంగళారం 16వ వార్డ్ కౌన్సిలర్ జంగం గీత వానజాక్షి సంజీవరావు ముఖ్య అతిథిగా పాల్గొని పిపిఎల్ సీజన్-4 గవర్నమెంట్ క్రికెట్ ప్లేయర్స్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గెలిచిన, ఓడిన జట్లకు సమానంగా బహుమతులు అందజేశారు. క్రీడలు ఆడడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా స్నేహబంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తూ యువతను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి. సంజీవరావు, మాజీ ఎంపీటీసీ యాదయ్య, పి. యాదయ్య, పి. కుమార్, పి. సురేష్ కుమార్, జై వెంకటయ్య, జై రాజారావు, అశోక్, నాగేష్, వెంకటయ్య, సంజు తదితరులు పాల్గొన్నారు. అలాగే అన్ని క్రికెట్ ప్లేయర్స్ ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు

**వనపర్తి మార్చి 20(ప్రజాక్షేత్రం):**

వనపర్తి మండలం చిన్న గుంటపల్లె గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. టోర్నమెంట్ చివరి రోజు బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన మణిగిల్ల టీం కు 40,000/ రూపాయల నగదును, షీల్డ్ ను చిన్నారెడ్డి బహుకరించారు. రన్నర్ ఆఫ్ గా నిలిచిన చిన్నగుంటపల్లె టీంకు 25,000/రూపాయల నగదును,షీల్డ్ ను చిన్నారెడ్డి బహుకరించారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ... క్రికెట్ కు ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ ఉందని, ప్రపంచ క్రికెట్ టోర్నమెంట్ లో భారత మహిళా జట్టు, భారత పురుషుల జట్టు ప్రపంచ విజేతలుగా నిలిచారని అన్నారు. భారతదేశంలో నిర్వహిస్తున్న ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ వల్ల గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడాకారులను వెలికి తీసి జాతీయస్థాయిలో ఆడే విధంగా ఐపీఎల్ టోర్నమెంట్ ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒలంపిక్స్ క్రీడలను కూడా రాష్ట్రంలో నిర్వహించాలని కోరుతున్నారని అన్నారు. ఒలంపిక్స్ లో భారతదేశ క్రీడాకారులు పథకాలు సాధించే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను తయారు చేస్తుందని అన్నారు. క్రీడాకారులు స్నేహభావంతో మెలిగి క్రీడా స్ఫూర్తిని చాటాలని అన్నారు. క్రీడాకారులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పౌష్టిక ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివసేన రెడ్డి వనపర్తి నియోజకవర్గానికి స్పోర్ట్స్ స్కూల్ తీసుకువచ్చే ఈ నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. చిన్న గుంటపల్లె వివేకానంద యూత్ నిర్వహించే స్వచ్ఛమైన కార్యక్రమాలను తెలుసుకొని వివేకానంద యూత్ ను,టోర్నమెంట్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి మండల్ మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షులు నాగార్జున, వనపర్తి మండల్ కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, వనపర్తి మండల్ ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, వనపర్తి మండల్ వైస్ ఎంపీపీ సురేష్ గౌడ్, సీనియర్ నాయకులు ఎత్తం పెద్ద కోటయ్య, పాండురావు, బాలచంద్రి, రఘు, సిరివాటి సురేష్, రాంజీ నాయక్, శివకుమార్, చంద్రకాంత్, భాస్కర్, లక్ష్మయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు పాల్గొన్నారు.



## చీకట్లు పోయేలా చిన్నమంగళారంలో ఇఫ్తార్ విందు

- పండ్లు పంచుకుంటూ పెరిగిన బంధం మనసులు కలిపిన మధురమైన సందేశం
- మతాలు వేరైనా మనసులు ఒక్కటే అని చిన్నమంగళారం చెప్పిన గొప్ప సత్యం
- ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని మొయినాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల మాజీ ఉపాధ్యక్షుడు గన్నేపాగ నర్సింగ్ రావు వెల్లడి

**మొయినాబాద్ మార్చి 20(ప్రజాక్షేత్రం):**

రంజాన్ పర్వదినం సందర్భంగా మొయినాబాద్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షుడు గన్నేపాగ నర్సింగ్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు ఆత్మీయత, సోదరభావంతో బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు గ్రామ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామాజిక ఐక్యతను ప్రతిబింబించారు. ఇఫ్తార్ సమయంలో పాల్గొన్నవారు ఒకరికి ఒకరు పండ్లు తినిపించుకుంటూ ప్రేమ, పరస్పర గౌరవాన్ని చాటుకున్నారు. కార్యక్రమం అంతటా స్నేహపూర్వక వాతావరణం నెలకొని అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గన్నేపాగ నర్సింగ్ రావు మాట్లాడుతూ, రంజాన్ మాసం కేవలం ఉపవాసానికి మాత్రమే కాకుండా సహనం, దాతృత్వం, మనుషుల మధ్య ప్రేమను పెంపొందించే పవిత్ర కాలమని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సోదరభావంతో జీవించడం ద్వారా శాంతి, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మనుషుల మధ్య దూరాలను తొలగించి, హృదయాలను దగ్గర చేసే వేదికలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. మతాలు వేరైనా మనసులు ఒక్కటే అని, చీకట్లు తొలగి పోయేలా చిన్నమంగళారంలో ఇఫ్తార్ విందు జరిగిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ విందును అభినందిస్తూ, ఇలాంటి ఐక్యతా కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు.



## యువత వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలి

- గజ్వేల్ బి ఆర్ యస్ పార్టీ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి
- ప్రొఫారేటర్స్: అజీజ్ నర్సిములు, నరేష్ ప్రవీణ్

**గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి (ప్రజాక్షేత్రం):**


జగదేవపూర్ మండల కేంద్రంలోని స్థానిక ఎల్లమ్మ టెంపుల్ ఎదురుగ టీ గార్డెన్ షాప్ ప్రొపరేటర్లు అజీజ్ నర్సింలు నరేష్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి వారి చేతుల మీదుగా ఆరంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులకు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని ఉపాధి అవకాశలను కలి పించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పను గట్ల శ్రీనివాస్ గౌడ్ ఉప సర్పంచ్ మచ్చ గణేష్ ఎర్రవల్లి సర్పంచ్ కవిత రాంమోహన్ రెడ్డి ఉప సర్పంచ్ కరుణర్ మాజీ సర్పంచ్ బిక్షపతి తుమ్మ కృష్ణ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు కిరణ్ గౌడ్, మాజీ ఎంపిటిసి కొత్త కవితా శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ మచ్చ గణేష్ బి ఆర్ యస్ గ్రామ అధ్యక్షులు నాగరాజు, మండల కో ఆప్షన్ నెంబర్ ఇక్బాల్ దౌలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు నిర్వాహకులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



# ఈ యంగ్ బ్యూటీకి అక్కడైన కలిసొచ్చేనా?

సినిమా ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే.. అందం, అభినయం, నటనతో పాటు అదృష్టం కూడా కలిసి రావాలి. అలాంటి పరిస్థితిలోనే ఉంది యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్న ఇప్పటివరకు ఆమెకు సరైన హిట్ రాలేదు. కొన్ని సినిమాలు విజయానికి దగ్గరగా వెళ్లినప్పటికీ భాగ్యశ్రీకి మాత్రం కలిసి రావడం లేదు. ప్రజెంట్ తెలుగులో అఖిల్ 'లెనిల్' చిత్రంలో నటిస్తుంది. కానీ ఈ సినిమా కూడా వాయిదాలపై నడుస్తుండటంతో.. ఇప్పుడు ఈ అమ్మడు కోలీవుడ్ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. తమిళంలో ప్రయత్నం చేయాలని భావించిన ఈ హీరోయిన్ రీసెంట్‌గా కొత్త సినిమాకు ఓకే చెప్పినట్లు సమాచారం. తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న 'సెయాన్' సినిమాలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీని కమల్ హాసన్ తన బ్యానర్‌పై నిర్మిస్తుండటంతో ప్రేక్షకుల్లో హై ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఇప్పుడు ఇందులో భాగ్యశ్రీ భాగం కాబోతున్నట్లు వార్తలు వస్తుండగా.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. మరి ఈ సినిమాతో అయినా ఈ హీరోయిన్ కెరీర్ టర్న్ అవుతుందేమో వేచి చూడాల్సి ఉంది.





## పెళ్ళికి పిలవలేదని రీల్ చేసిన చిన్నారి..
### ఇంటికి పిలిపించుకుని షాకిచ్చిన దేవరకొండ దంపతులు

విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు గత నెల 26వ తేదీన ఉదయపూర్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత సుమారు వారం రోజుల పాటు వారి వెడ్డింగ్ సెలబ్రేషన్స్ జరుగుతూనే ఉన్నాయి. అయితే, అదే సమయంలో వారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా భారతదేశ వ్యాప్తంగా పలుచోట్ల స్వీట్లు పంపిణీ చేశారు. ఈ విషయం మీద ఒక చిన్నారి రీల్ చేసింది. "మీరు యాక్టర్స్, మేము రిలేషన్స్ (ప్రేక్షకులం) ఉంటాం.. మనం మనం ఒకటే, మమ్మల్ని ఎందుకు పెళ్ళికి పిలవలేదు?" అంటూ క్యూట్ క్యూట్ మాటలతో రీల్ చేయడంతో అది విజయ్ దేవరకొండ దృష్టికి వెళ్లింది. "ఖచ్చితంగా మా ఇంటికి వచ్చి కలుద్దువు గాని" అంటూ ఆమె రీల్ కి అప్పట్లో వారు కామెంట్ చేశారు.అయితే ఈ విషయం మరిచిపోయి ఉంటారులే అనుకుంటే, ఈరోజు ఏకంగా ఆ చిన్నారిని తమ ఇంటికి పిలిపించుకోవడమే కాదు.. తాను, రష్మిక స్వయంగా వడ్డిస్తూ ఆ చిన్నారిని ఆనందింపజేశారు. ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఆ చిన్నారి మరోసారి రీల్ చేసి తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసింది. ఇక ప్రస్తుతానికి విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన' సినిమాతో పాటు 'రణబలి' అనే సినిమా చేస్తున్నాడు. అలాగే రష్మిక కూడా వరుస సినిమాలను లైన్లో పెట్టింది.

# వారణాసి తర్వాత మహేశ్ నటించే సినిమా ఏంటి?

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానుల కళ్లన్నీ ఇప్పుడు 'వారణాసి' పైనే ఉన్నాయి. దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాతో మహేష్ బాబు 'పాన్ వరల్డ్' స్టార్‌గా తన గ్లోబల్ జర్నీని మొదలుపెట్టబోతున్నారు. అయితే, ఈ భారీ ప్రాజెక్ట్ సెట్స్‌పై ఉండగానే, మహేష్ తదుపరి సినిమా ఎవరితో ఉండబోతోంది? అనే చర్చ సోషల్ మీడియాలో జోరందుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, 'వారణాసి' చిత్రానికి సంబంధించిన షూటింగ్ ఈ ఏడాది ఆగస్ట్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాను 2027, ఏప్రిల్ 7న అత్యంత ప్రతిష్టాత్మకంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే 'గుంటూరు కారం' తర్వాత దాదాపు మూడేళ్ల గ్యాప్ తీసుకుని వారణాసి వస్తుండటంతో, ఈసారి గ్యాప్ లేకుండా మరో సినిమాను లైన్‌లో పెట్టాలని మహేష్ భావిస్తున్నారట.

వారణాసితో గ్లోబల్ ఇమేజ్ రాబోతుండటంతో, మహేష్ బాబు తన నెక్స్ట్ మూవీని కూడా అదే స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సందీప్ వంగా మేకింగ్ స్టైల్ హాలీవుడ్ ప్రమాణాలకు తగ్గట్టుగా ఉంటుంది. మహేష్ లాంటి క్లాస్ అండ్ మాస్ హీరోను సందీప్ తనదైన రాస్టైల్‌లో చూపిస్తే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ప్రస్తుతం ప్రభాస్‌తో 'స్పిరిట్', ఆ తర్వాత 'యానిమల్ పార్క్' (సీక్వెల్) ప్రాజెక్టులతో సందీప్ బిజీగా ఉన్నారు. మరి మహేష్ కోసం ఆయన ఎప్పుడు టైం



కేటాయిస్తారు అనేది సస్పెన్స్‌గా మారింది. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ మార్కెట్ అమాంతం పెరిగిపోతుంది. కాబట్టి ఆయన తర్వాతి ప్రాజెక్ట్ కేవలం తెలుగుకో లేదా ఇండియాకో పరిమితం కాకుండా, గ్లోబల్ ఆడియన్స్‌ను మెప్పించేలా ఉండాలని మహేష్ పట్టుదలతో ఉన్నారు. వారణాసి పూర్తయ్యే లోపు మహేష్ ఏ డైరెక్టర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు? మళ్ళీ ఏదైనా ప్రయోగాత్మక చిత్రంతో వస్తారా? అన్నది ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్.

## రాజాసాబ్ గందరగోళం బయటపెట్టిన మైత్రీ శశి

'రాజా సాబ్' ప్రీమియర్స్ విషయంలో పెద్ద గందరగోళం జరిగిన సంగతి తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం నుంచి రేట్ల పెంపు జీవో మీద క్లారిటీ రాకపోవడంతో.. టికెట్ల అమ్మకాలు జరిగిన షోస్ పడకుండా పెద్ద గందరగోళమే జరిగింది. తాజాగా ఇదే విషయాన్ని ఒక సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి హాజరైన మైత్రీ శశిని ప్రశ్నిస్తే, అసలు ఆ రోజు ఏం జరిగింది అనే విషయాన్ని చెప్పే ప్రయత్నం చేశారు. "అప్పుడు ఇదే అంశం మీద కోర్టులో ఐదు కేసులు పెండింగ్ ఉన్నాయి, ఆ విషయం మాకు తెలియదు. ఆ 5 కేసులు మేమే పుటప్ చేయాల్సి వచ్చింది. వాటిని మేము పుటప్ చేసి అప్లై చేస్తే.. సినిమా ఫ్రైడే రిలీజ్ అంటే కోర్టు బుధవారం సాయంత్రం జడ్జిమెంట్ ఇచ్చింది. ఆ ఐదు కేసులు కొట్టివేసి దానికి సంబంధించిన డాక్యుమెంటేషన్ అంతా ఆ రోజు రాత్రి మా చేతికి వచ్చింది. అది వచ్చేదాకా మనం తెలంగాణ ప్రభుత్వానికి అనుమతి కోరలేకపోయాం."

"బుధవారం రాత్రి ఆర్డర్స్ మా చేతికి వచ్చాక, గురువారం ఉదయం మేము అప్లై చేశాం. ఈ క్రమంలోనే అది చాలా షార్ట్



నోటీస్ అవ్వడంతో ఆరోజు మాకు టికెట్ రేట్ల పెంపు జీవో రాలేదు, ఎప్పుడో లేట్ నైట్ వచ్చింది. పెద్ద పెద్ద సినిమాలు చేసినప్పుడు ఆ నిర్మాతలు కానీ, ఆయా హీరోల ఫ్యాన్స్ కానీ పెద్ద రెవెన్యూ ఎక్స్పెక్ట్ చేస్తారు. ఇదే విషయంలో మేము అడుగుతూనే ఉన్నాం, వాళ్ళు చెబుతూనే ఉన్నారు. 'ఐదు నిమిషాల్లో వస్తుంది' అని సాయంత్రం ఏడు గంటల నుంచి చెబుతూనే వచ్చారు. అయితే ఆ జీవో రావడం లేదని మేము టక్కుమని డెసిషన్ తీసుకోవడానికి లేదు. ఎందుకంటే పెద్ద హీరో సినిమా, ఆ రిస్క్ తీసుకోలేకపోయాం" అని అన్నారు.

## చీరలో.. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో నడుము అందాలు హైలైట్

టాలీవుడ్ ప్రముఖ నటుడు నాగ చైతన్య భార్యగా, అలాగే నటిగా శోభిత ధూళిపాళ గుర్తింపును సంపాదించుకుంది. మోడలింగ్ రంగం నుండి కెరీర్‌ను ప్రారంభించిన ఈమె, తర్వాత సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా మేడ్ ఇన్ హెవెన్ వెబ్ సిరీస్ ద్వారా మంచి పాపులారిటీ పొందింది.

తెలుగులో ఈ బ్యూటీ గూఢచారి, మేజర్ వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ రెండు చిత్రాల్లో కూడా అడవి శేష్ హీరోగా నటించడం విశేషం. నాగచైతన్య ఇటీవల 'తండెల్' అనే సినిమాలో నటించాడు. ఈ చిత్రం మంచి విజయం సాధించింది, అలాగే ఇందులోని తన నటనతో చైతూ మంచి ప్రశంసలను కూడా అందుకున్నాడు.

ఈ చిత్రంలోని ఆయన నటనకు తెలంగాణ ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డు కూడా దక్కింది. ఈ అవార్డు వేడుకకు నాగచైతన్యతో పాటు శోభిత కూడా హాజరైంది. ఈ సందర్భంగా ఆమె ట్రాన్స్‌పరెంట్ నెట్ ఫ్యాబ్రిక్‌తో ఉన్న సిల్వర్‌గ్రే టోన్ శారీ, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌లో స్టైలిష్‌గా మెరిసింది. ఈ లుక్‌లో ఆమె చాలా గ్లామరస్‌గా కనిపించడంతో ఆ ఈవెంట్‌కు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## త్రివిక్రమ్ నా గురువు.. వచ్చే సినిమాతో ఆస్కారే లక్ష్యం!

ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్.తమన్ తన కెరీర్‌లో ఎందరో దర్శకులతో పనిచేశారు. కానీ, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఆయనకు ఉన్న అనుబంధం చాలా ప్రత్యేకమైనది. తాజాగా ఆయన ఎన్టీవీకి ఇచ్చిన పాడ్‌కాస్ట్‌లో త్రివిక్రమ్‌ను ఒక 'యోగి'గా అభివర్ణించడమే కాకుండా, తన తదుపరి లక్ష్యాల గురించి తమన్ ధీమా వ్యక్తం చేశారు.

**ఒక ఆధ్యాత్మిక గురువు**

త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో తనకున్న పరిచయం కేవలం దర్శకుడుసంగీత దర్శకుడి సంబంధం మాత్రమే కాదని తమన్ స్పష్టం చేశారు. "త్రివిక్రమ్ గారు ఒక మేధావి. ఆయన పుస్తకాలు చదువుతారు, చాలా నిశ్శబ్దంగా ఉంటారు. ఆయనతో మాట్లాడటం ఒక మెడిటేషన్ (ధ్యానం) లాంటిది. ఒక వ్యక్తిని సరిగ్గా చదవగలిగే శక్తి ఆయనకు ఉంది. నన్ను ఒక మంచి మనిషిగా మార్చడంలో ఆయన పాత్ర ఎంతో ఉంది" అని తమన్ కొనియాడారు. తమ మధ్య ఉన్నది కేవలం వృత్తిపరమైన సంబంధం కాదని, అది ఒక లోతైన భావోద్వేగమని చెప్పారు. త్రివిక్రమ్ తనను నమ్మిన విధానం వల్లే 'అరవింద సమేత', 'అల వైకుంఠపురములో' వంటి మ్యూజికల్ బ్లాక్ బస్టర్స్ ఇవ్వగలిగానని పేర్కొన్నారు. నా కెరీర్‌లో 100వ సినిమా అరవింద సమేత అని చెప్పుకొచ్చారు. త్రివిక్రమ్ దగ్గర రామాయణం స్క్రిప్ట్ ఉంది.. ఇప్పుడు మనం మాయాబజార్ సినిమాను ఎలా అయితే చూస్తున్నామో, మరొక వంద ఏళ్ల వరకు ఈ రామాయణాన్ని జనాలు అలాగే చూస్తారని అన్నారు.


ఈ పాడ్‌కాస్ట్‌లో ఆస్కార్ అవార్డు ప్రస్తావన రాగా, థమన్ చాలా ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం తెలుగు సినిమా మార్కెట్ గ్లోబల్ స్థాయికి చేరుకుందని, మన కంటెంట్ చూసి ప్రపంచం ఆశ్చర్యపోతోందని అన్నారు. "నేను చేసే తదుపరి పెద్ద సినిమాలతో ఆస్కార్ స్థాయికి చేరుకోవాలనే పట్టుదలతో ఉన్నాను. మన మట్టి వాసన ఉన్న సంగీతాన్ని గ్లోబల్ ట్రెండ్స్‌కు అనుగుణంగా అందించగలిగితే అది సాధ్యమే. దానికి కావాల్సిన కసి, సాంకేతికత మా దగ్గర ఉన్నాయి" అని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో తెలుగు జెండా ఎగురవేస్తాననే సంకేతాలు ఇచ్చారు.



# వాయిదా లేదు.. పెద్ది ఆన్ ట్రాక్

ఆర్ఆర్ఆర్ (RRR) తర్వాత రామ్ చరణ్ తేజ హీరోగా నటిస్తున్న సినిమా 'పెద్ది'. 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. దానికి తగ్గట్టుగానే, సినిమా నుంచి రిలీజ్ అవుతున్న ప్రతి ప్రమోషనల్ స్టఫ్ సినిమా మీద అంచనాలను మరింత రెట్టింపు చేసేలా ఉంటున్నాయి. అయితే, ఈ సినిమా వాయిదా పడుతుందని ముందు నుంచి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి ఈ సినిమా ఏప్రిల్ 30వ తేదీన రిలీజ్ అవుతుందని చివరిగా ప్రకటించారు. అయితే ఆ రోజు కూడా సినిమా రిలీజ్ అవ్వడం కష్టమేనా అనే ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. తాజాగా టీం నుంచి అందుతున్న సమాచారం మేరకు, ఈ సినిమా వాయిదా పడడం లేదని అంటున్నారు.

ఈ సినిమాకి సంబంధించి కొంత ప్యాచ్ వర్క్ తో పాటు, స్పెషల్ సాంగ్ మాత్రమే పెండింగ్ ఉంది. ప్రస్తుతానికి రామ్ చరణ్ తేజ అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్నారు. ఈ దీక్షలో ఉండగా స్పెషల్ సాంగ్ చేయలేరు కాబట్టి, ప్రస్తుతానికి ఆ సాంగ్ చేయడం లేదు. రామ్ చరణ్ అయ్యప్ప దీక్ష పూర్తయిన వెంటనే ఆ సాంగ్ షూట్ చేయబోతున్నారు. మరోపక్క బుచ్చిబాబు ప్యాచ్ వర్క్ ఫినిష్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమాని ఏప్రిల్ 30వ తేదీన గ్రాండ్ స్కేల్లో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా యుఎస్ (US) బుకింగ్స్ కూడా అదే



రోజు ఓపెన్ చేసే అవకాశం ఉంది. కాబట్టి 'పెద్ది' పోస్ట్‌పోన్ అయ్యే అవకాశం ఉందంటూ జరుగుతున్న ప్రచారానికి టీం బ్రేకులు వేసినట్లే!

## కొరియన్ మ్యూజిక్ స్టార్ట్.. కొత్త పోస్టర్‌తో హింట్ ఇచ్చిన టీమ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం హర్రర్, కామెడీని రిఫ్రెషింగ్ క్రాస్‌కల్చరల్ ట్విస్ట్‌తో బ్లెండ్‌తో తెరకెక్కుతోంది. ఇండియన్, కొరియన్ నేపథ్యాలలో రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇంతకు ముందు ఎన్నడూలేని భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఇదిలా ఉంటే.. రీసెంట్‌గా టీమ్ ఫైనల్ షెడ్యూల్ అప్డేట్ ఇచ్చిన విషయం తెలిసిందే.

ఈ షెడ్యూల్‌లో పాటలు, కథలో ముఖ్యమైన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించనున్నారని, వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య పాల్గొనున్న ఈ షెడ్యూల్‌ను కొరియాలోని అద్భుతమైన ప్రదేశాల్లో చిత్రీకరించనున్నారని తెలిపారు. ఇక ఉగాది పండుగ సందర్భంగా మరో అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు వరుణ్ రేడియో పట్టుకున్న ఫొటోను షేర్ చేస్తూ.. 'కొంచెం తీపి, కొంచెం కారం, ఇంకా బోలెడంత స్వాగ్.. ప్రతి రుచితో నిండిన ఒక అద్భుతమైన



బ్లాక్‌బస్టర్‌తో కనకరాజు త్వరలో వెండితెరపైకి రాబోతున్నారు' అని తెలిపారు. ఇక రిలీజ్ చేసిన పోస్టర్ ఆధారంగా త్వరలోనే మ్యూజికల్ జర్నీ స్టార్ట్ కాబోతున్నట్లు హింట్ ఇచ్చారు చిత్ర బృందం.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/26/A2094